# దయానిధి



కనకమ్మ తిట్టుకుంటూ తిమ్ముకుంటూ పనికానిచ్చి మేనువాల్చింది చాపమీద. అలిసి వున్నదేమో నిద్రలోకి జారింది. రాత్రి పదకొండు గంటలవేళ ఊరు మాటు మణిగి నిశ్శబ్దం ఆవరించింది.

కనకమ్మ గర్బగుడిలో దేముని కెదురుగా నిలబడింది. యెత్తైన కుందుల్లో దీపారాధన. ఊదొత్తుల పొగ గర్బగుడిని నింపింది. కొబ్బరి చిప్పలు రెండు దేముని ముందున్నాయి. నైవేద్యమైంది. తీర్ధం కోసం నిలబడింది. పూజారి యెటో వెళ్లాడు. పేరుకి పూజారేగాని లక్ష పనులు. గొప్ప వ్యవహర్త. జంధ్యాలమ్ముతాడు. శ్రావణ పౌర్ణమికి డబ్బు అందుతుంది. కాసిని తాను కొని మారుబేరానికమ్ముతుంది కనకమ్మ రహస్యంగా. యేదో గొణుగుతున్నది.

యెదుట మనిషెత్తు పాలరాతి విగ్రహం మనిషైనాడు. నవ్వుతున్నాడు. ''యేమిటి గొణుగుతున్నావు కనకమ్మా? దూషిస్తున్నావా? దెప్పుతున్నావా? న్యాయం చూడు కనకమ్మా. నేను దయానిధిని కానా?'' అన్నాడు. చెవుల కుండలాలు ధగధగాలాడినై. గుండెమీది శ్రీవత్సం తళతళలాడింది.

'పేరుకే'' అన్నది కనకమ్మ. యెలాగైతేనేం గొంతు పెగిలి మాట బైటికి వచ్చింది. లోపల రక్తం వుడికి పోతున్నది కనకమ్మకు.

''అబ్బెబ్బే అలా ఒప్పుకోను. నేను ప్రూవ్ చేస్తూ పోతా. యెక్కడైనా తభావతుంటే నువ్వు క్రాసెగ్జామిన్ చేయచ్చు. అగ్రీడ్'' అన్నాడు పార్ధసారధి.

మూతి విరిచి, ''కానీ'' అన్నది కనకమ్మ.

''అలా దారికిరా. నీకు పొలాల మీదా, భోగభాగ్యాల మీదా హోదామీదా మక్కువని గ్రహించాను. పొలాలూ, గొడ్డు గోదా కలిగిన వూరి పెద్ద యింట్లో నీ చేత అడుగుపెట్టించానా లేదా?''

''యేదీ సంపదా? మూణ్ణాళ్ల ముచ్చటైంది. అమ్మినంత అమ్మి మొదటి బావగారు మోసగించి భాగాలు పంచితే, చాలీచాలని భూమి దక్కింది. పశువులు లేవు గానీ, పిల్లలు యేటా పంటలాగా వచ్చారు'' అని మెటికలు విరిచింది కనకమ్మ.

''అలా అనకుమరి కనకమ్మా. నీకు మా గొప్ప బుర్రయిచ్చానా లేదా. దాన్ని న్యాయమార్గాన వాడావా? లేదు. నేను దయానిధినే''.

''యేడ్చి మొహం కడుక్కున్నట్టున్నది. మొగుడు మొద్దులు పనిచేయననీ గొప్పింటి బిడ్డననీ మొరాయిస్తే, నా ఒక్కతె వల్లా యేమౌతుంది? రెండు చక్రాలూ నడిస్తేనే రథం నడుస్తుంది''.

నవ్వాడు శ్రీనివాసులు. ''నీకు వున్న దానితో తృప్తి పడే అలవాటు లేదు. పొదుపరివీ గాదు''. యీ మొగుడు పోతే బాగ్గెమంతుల యింట్లో వంటన్నా చేసి సంపాయించుకోవచ్చునే'' అని ఆలోచిస్తున్నావని గ్రహించి ''కనకమ్మ తెలివిగలదే పనిమంతురాలే. దాని కోరిక తీరుద్దాం. రెండు చేతులా సంపాయిస్తుందేమో చూడాలి'' అనుకుని, వయసన్నా మళ్లని నీ మగనివి, మూడ్రోజులో వైకుంఠానికి పంపేసి నీకు మేలు చేశాను కానా నేను ధయానిదినే''.

''ధూ!'' అని మనసులోనే అనుకుని పైకన్నది కనకమ్మ.

''అదేం దయా? డజన్మందిని నా యెదాన పడేసి పెంచుకోమంటివి. మగనికి పూజారి పనన్నా యిప్పించావు కావు''.

''యేదీ పెద్ద కొడుకు అర్చకుడుగా కుదురుకుని శ్రమ జీవినౌతానని పొలం పన్లకూ వెళ్తానంటే వెళ్లనీలేదు నువ్వు. ఆరిస్టోక్రాట్ పోకడలు నీవి. వాడు శ్రమజీవే. అవమానం అనుకోడు''.

''శ్రమ జీవి యెట్లా అయినాడూ? అర్ధాకలితో పనిలోకెళ్తే నయంగాని వ్యాధికి గురైనాడు. నా యెదానే వేసుకున్నా. తల్లినిగా. వాడి సంపాదన వాడి

మందులకి సరిపోయింది. యేమ్మిగిలింది?''.

"ఉండు. నన్ను చెప్పనీ. వాడెంత పేరూ ప్రతిష్ఠా సంపాయించాడూ? నీ దురాశే నీకు చేటు తెచ్చింది. ఆర్నెల్లు హంసలాగా జీవించి అందరి మనసుల్లో నిలిచిపోయాడు. తల్లి చేతికంది వచ్చినవాడు పోయాడే అని వాడి మిత్రులు, పరిచితులు, యాడాదికి సరిపడా గ్రాసానిక్కావల్సింది పంపారే. నేనే వారందరి మనసుల్లో వుండి ఆ పని చేయించా''.

"కడుపు కోత తెచ్చావు. చెట్టంత మొగుడినీ పొట్టన పెట్టుకున్నావు దయానిధివా?'' అని దెప్పింది.

వెంకటేశ్వరుడు తలవంచి కళ్లు పైకెత్తి చూశాడు.

"యేమో నువ్వు నాకు కడుపుకోతతో బాధపడుతున్నట్టు కనబడలేదు. సూతకం వెళ్లనే లేదు. నీ వ్యవహారజ్ఞానం వాడుకున్నావు. సంబంధాలు స్థిరపరచటం, కమీషన్, పొలాల అమ్మకాలు, కొనుగోలు, రాయితీలు, కవులుకియటం. అందులో లాభం తీయటం, స్మాల్ స్కేల్ వడ్డీ వ్యాపారం, ప్రో నోట్ వాయించటం, చేబదుళ్లివ్వటం వాటికి వడ్డీ లాగటం, గురువు లాగా మేకప్ చేసుకుని మఠాలలో చేరి వుపదేశాలివ్వటం, కష్టసుఖాలు దేహికి గాని ఆత్మకంటవని, దుఃఖమూ శాశ్వతం గాదు జీవుడు మళ్లా రొటీన్‌లో పడి జీవితం సాగిస్తూ వుంటాడనీ తత్త్వచింతన వల్లిస్తూ ఆర్జిస్తునే వున్నావు. ఆ బుర్రకి పదును చెడకుండా చూసింది నేనే. దయానిధినే? కాదంటావా కనకమ్మా?''

"యెలా అయినావూ? అల్లుని వుద్యమ నాయకుని చేసి జైలుకి పంపావే'' అని కొరకొరలాడింది.

"అదీ నీ లాభానికే. కూతుర్ని నీ దగ్గర దింపేస్తే దాన్ని దాసిగా వంటమనిషిగా వాడుకున్నావు. జబ్బు మనుషులకి సేవచేసింది. చిన్నవారిని దయతో చూస్తూ వండి వార్చిపెట్టింది. అబ్బో! నువ్వా? యెంత గడుసుతనం

చూపావు? వంట జోలికిపోతే మెదడు మొద్దుబారుతుందని సంచారివైతివి''
అహహా అని నవ్వాడు శ్రీనివాసులు.

'' ఐవేజు చాలదని మాగాని అమ్మి వ్యాపారం పెట్టించి కొడుకుని అంటిపెట్టుకుని వున్నావా? నిజం చెప్పు? వేళకి వుడకేసిపెట్టావా? వాడి గొంతు నులమటం మొదలెట్టావు. తిరిగే కాలు తిట్టే నోరు. ఇంకా చెప్పనా కనకమ్మా!''
అహహా అని నవ్వుతున్నాడు శేషసాయి.

''సిగ్గులేని మొహానికి నవ్వే శృంగారమని నవ్వితే సరి. శీనూ! ఇల్లు మానేజ్ చేసేంత రాల్చక పేకాట, సిగరెట్టు, చదరంగం, స్నేహితులతో పొద్దు పుచ్చుతుంటే, తిరగకా తిట్టకా మన్నించాలా కొడుకును? నీవు శీత కన్ను వేసి వ్యాపారం వేలం వేయించావు. కర్కోటకుడివి. చిన్న సన్యాసులకి తిండేదీ నిలువ నీడేదీ? అది కర్కోటకమే. దయ యెలా అయిందీ?'' మెటికలు విరిచి తలతాటించింది కనకమ్మ.

''నే చేయలేదా పని. యేరోజుదారోజు చేతబెట్టమని నిగ్గదీస్తే, నీ వారు వాడిని రెచ్చగొట్టి ఇవ్వద్దు అని నేర్పితే కొడుకు పారిపోయాడు హిమాలయాలకు. నేను దయానిధిని కనకనే యెవరిని పీక్కుతిందామా అనే ఆలోచనగల నీకు నోరూ వాయీలేని మెతక మనుషులు అల్లునీ, కూతుర్నీ చూపించి పుణ్యం కట్టుకున్నా. యెక్కావా లేదా? యెక్కించావా లేదా? వేరే దారి చూశావా? మళ్లా లోకం కన్ను కప్పే వుద్దేశంతో పిల్లల్ని వదిలేసి యెటో వుడాయించావు. చిన్న పిల్లలు అనుకూలంగా వుండి పొట్టపోషించుకున్నారు. వారే నయం''.

కనకమ్మ కూనిరాగం అందుకున్నది. ''నిందించు దేవుడా నిందించు. రెండో అల్లునికి అవసానదశ అని వెళ్లాను. కూతురు గతేమిటో తెలియాలి. దాని అత్తవారు అమ్మించినంత అమ్మించి మిగిలింది తల్లిపేర పెట్టించారని తెలిసింది. కన్నకడుపు తీపిగదూ. దానిని తెచ్చేశా. మళ్లా యీ లోకంలో పడి

వుద్యోగస్థురాలయేట్లు చేస్తే నీ కన్ను కుట్టింది. దానిని మతి భ్రష్టుని చేశావు. చేతికందిన బిడ్డనల్లా లాగేశావు దేవుడా'' అని శోకించింది కనకమ్మ.

దేవుడు నవ్వాడు. ''కన్ను కుట్టలా నాకు. దయానిధిని గనకనే అలా చేశా. నీకు లాభించిందా లేదా? మతిభ్రష్టు సంపాదన నీ కంటికానలేదు. ఆమెను అడ్డంపెట్టుకుని, అర్జనుడు శిఖండిని అడ్డంపెట్టుకుని, భీష్ముని జయించి నట్టు, నీ ప్రతిభ చూపావు. చాలా సంపాయించావు స్థిరాస్తీ చరాస్తీ. స్వంత సంపాదనే నీ కానందమిస్తుంది. నే చెప్పలా? నేను దయానిధినే''.

''అన్ని విధాలా ఆసరాగా వున్న కూతుర్నెత్తుకుపోతే సంపాయించుకోక నోట మట్టి కొట్టుకోవాలనా నీ వుద్దేశం?''

''అబ్బెబ్బే, మళ్లా మేలు చేశా. మట్టి యెక్కడ కొట్టుకున్నావూ కనకమ్మ? అంతవరకూ కూతురే ఆసరా. ఆమెను నేతెచ్చేసుకున్నాక, యింకా లాభం, అల్లుడు, వాని ఆస్తీ మనమలూ మనుమరాండ్రూ అంతా నీకు చిక్కారు. వ్యవహర్తవైపాయె. నీ మెదడు కెంత మేత అందిందీ చెప్పనా?''

కనకమ్మకి దేవుని నవ్వు చూస్తే అరికాలిమంట నెత్తికెక్కింది. ''యేదో సరిపెట్టుకుంటూ రోజులు వెళ్లదీస్తుంటే నన్ను నా మానాన బతకనిచ్చావా? దేవుడా? లేదు. ఒక వంచకుడిని నా సంసారం మీదికి ఉసికొలిపావు. నవ్వులపాలైనాను. నా బిడ్డ వీధిలో నిలబడింది. దిక్కూ దివాణం లేదు'' అని కుంది అందుకుని కొట్టబోయింది కనకమ్మ.

దేముడు నవ్వుతూ దూరంగా వెళ్లాడు. ''భీముడిట్లాగే తన గదతో నన్ను మొత్తబోయాడు. నేనెవరినీ నీ మీదికి ఉసికొలపలేదు కనకమ్మా. డబ్బు కోసం యేంతింటూ వుంటావో ప్రపంచానికి చూపాను. తరవాత వంచకుని పిలక నీ చేతికి చిక్కిందా లేదా? లాభం చూపానా మరి? దయానిధినే! సందు చూపాను. సందు దొరికింది గదూ? వంచకుని వేపు వారిని తూర్పారాబట్టి, మూడుచెరువుల నీళ్లు తాగించాలని విశ్వప్రయత్నం చేశావా లేదా? గొప్ప అభినేత్రివి గదూ నీ

తడాఖా తెలిసింది ప్రతి పక్షులకి. హావభావ విలాసాలు చూపగలవు. రంగులు మార్చగలవు. ప్లేటూ ఫిరాయించగలవు. నీ ప్రతిభ పైకి వచ్చిందా లేదా? నేను దయానిధినే. తప్త హృదయంతో వచ్చిన కొడుకుని వంటవాడుగా మార్చావా లేదా? నీదే పైచేయి అని గర్వించావా లేదా? నేను దయానిధిగానా?''

దయానిధి అదృశ్యమైనాడు.

కనకమ్మ మేల్కొన్నది.

తెలతెలవారుతున్నది.

*******